


'తెలుగువాడు' సంపాదకులకు

నమస్కారం మీ (మా) పత్రిక సర్వాంగ సుందరంగా వెలువడుతోంది. హార్దికాభినందనలు. ఈ వారం 9-4-85 సంచిక మీద ముఖచిత్రం నా అభిమాన నర్తకి 'చిలక' మైమరపించింది. వెంటనే ఫ్రేంలో బిగించి నా టేబుల్‌మీద అమర్చానంటే నమ్మండి. 'తెలుగువాడు' పత్రిక కలకాలం పచ్చగా వెలగాలని మనసారా కోరుకుంటూ

—చంటిబాబు

10-4-85 గోంగూరపాడు.

* * *

ప్రియమైన పాఠకాభిమానీ,

మీ వుత్తరం మా 'తెలుగువాడు'లో ప్రచురించాం. వుత్తరం క్రింద 'బహుమతి పొందిన లేఖ' అని కూడా రాశాం. ఆ ముక్క వుత్తరం పైభాగంలో రాయకుండా వుండటం మనపత్రిక ప్రత్యేకత.

సదా మీ సహకారం కోరుతూ,

ఆదరాబాద్
22-4-85

సంపాదకుడు,
'తెలుగువాడు' వారపత్రిక

* * *

'తెలుగువాడు' సంపాదకులకు,

ప్రియాభివందనాల్తో.

నావుత్తరానికి బహుమతియిచ్చి, నన్ను ఆనందంలో ముంచి తేల్చిన ఘనత మీకే దక్కింది. ఏమైనప్పటికీ మన 'తెలుగువాడి'కి 'తెలుగువాడే' సాటి ! మీరు పంపబోయే బహుమతి కోసం ఎన్నోవేల కళ్ళతో ఎదురుచూస్తూ.

వినమ్రుడు చంటిబాబు,
గోంగూరపాడు.

28-4-85

తెలుగువాడు సంపాదకులకు,

లక్షల నమస్కారాల్తో

నా పుత్తరానికి బహుమతి యింకా అందలేదు. తొందరలో పంపించండి. నా మనసు తహతహతో నిప్పులో పడిన మాంసం ముక్కలాగా వేగుతోంది.

వినమ్రుడు చంటిబాబు

28-4-85

* * *

'తెలుగువాడు' సంపాదకమహాశయా !

లక్షలాది నమస్కారాలతో—

నా చిరునామా కావాలని పత్రికా ముఖంగా అడిగారు. మీ నిజాయితీకి పదేపదే కృతజ్ఞతాభివందనాలు. నా అడ్రస్ కింద రాస్తున్నాను. బహుమతి తొందరగా పంపించరూ ! ప్లీజ్...

వినమ్రుడు చంటిబాబు,
తోకతిప్పలవీధి,
గోంగూరపాడు,
తూ. గో. జిల్లా

10-6-85

* * *

'తెలుగువాడు' సంపాదక మహాశయా ! నమస్కారం. అడ్రస్ కావాలంటే వెంటనే పంపించాను. బహుమతి పంపారా? లేదే ? పంపరేం ?

—వినమ్రుడు చంటిబాబు.

10-7-85

* * *

'తెలుగువాడు' సంపాదకులకు

నమస్కారం. నా లేఖకు బహుమతి వచ్చిందని ప్రకటించారు. యింతవరకూ బహుమతి పంపలేదు. అసలు ఆ బహుమతి ఏమిటో, ఎలా పంపిస్తారో తెలుసుకోవాలని వుంది. వెంటనే జవాబయినా రాయండి లేదా బహుమతి అయినా పంపించండి.

చంటిబాబు (గోంగూరపాడు)

20-7-85

* * *

చంటిబాబుగారూ !

లేఖ ఏమిటి ? బహుమతి ఏమిటి ? ఏ తేదీ సంచిక ? వివరాలు కావాలి !

—సంపాదకుడు,
'తెలుగువాడు'

5-8-85

* *

యం.వి.వి. సత్యనారాయణ

అయ్యా, సంపాదకులవారూ !

9-4-85 సంచిక గురించి నేను రాసిన ఉత్తరానికి బహుమతి ప్రకటించారు. ఆ వుత్తరం తాలూకా జెరాక్స్ కాపీ ఒకటి ఈ ఉత్తరంతో జత పర్చుకుంటున్నాను. దయచేసిబహుమతి వెంటనే పంపించగలరు.

—వినమ్రుడు చంటిబాబు (గోం.పా.)
తో.తి. వీధి,
తూ. గో. జిల్లా,

9-8-85

* *

చంటిబాబుగారూ !

బహుమతుల పంపిణీ వ్యవహారం అక్కౌంటెంట్ గారిది. గమనించగలరు.

—సంపాదకుడు
"తెలుగువాడు"

25-8-85

* *

'తెలుగువాడు' వారపత్రికా అక్కౌంటెంట్ గారూ !

9-4-85 సంచికలో నా వుత్తరానికి బహుమతి ప్రకటించారు. త్వరలో పంపించగలరు.

వినమ్రుడు చంటిబాబు,
తో.తి. గోం.పా. తూ.గో.

28-8-85

* *

చంటిబాబు గారికి,

మీరు రాసినది 'ఉత్తరం' కథా? కవితా ? వివరం రాయండి.

అక్కౌంటెంట్
తెలుగువాడు (ఆదరాబాద్)

30-9-85

* *

అక్కౌంటెంట్ గారికి,

నమస్కారం. నేను రాసిన వుత్తరం కేవలం వుత్తరమే! కథాకాదు కాకర కాయాకాదు. ప్రకటించిన విధంగా బహుమతి పంపించగలరు.

చంటిబాబు

3-10-85

* *

చంటిబాబుగారూ !

మీ వుత్తరానికి ఎంత బహుమతి యివ్వాలో ఎడిటర్‌గారు సూచించాలి. గ్రహించగలరు.

అక్కౌంటెంట్, తె. వా. (ఆ.బా)

30-10-85

* *

ఎడిటర్‌గారూ !

30-10-85 తేదీతో మీ అక్కౌంటెంట్ గారు రాసిన వుత్తరం, అచ్చయిన లేఖా, (9-4-85 'తెలుగువాడు') ముఖచిత్రం జెరాక్స్ కాపీ పంపిస్తూ ఉన్నాను. త్వరలో బహుమతి రికమెండ్ చేయించగలరు. ఇది ఏడో నెల ! ఒక పాఠకాభిమానిని యింత హింస పెట్టడం తగదు.

చంటిబాబు (గోం.పా)

3-11-85

* *

చంటిబాబుగారూ !

లేఖకు బహుమతి పొందిన ఎవరూ కూడా యిలా 'బహుమతి' పంపించమని రాయలేదు. గుర్తించగలరు.

అక్కౌంటెంట్, తె.వా. (ఆ.బా)

20-11-85

*　　　　*

అకౌంటెంట్ గారూ !

పాఠకులు తమ లేఖకు బహుమతి వచ్చినప్పుడు సదరు బహుమతిని పంపించమని రాయడానికి మొహమాట పడి వుంటారు. ఇంతవరకూ నాకు ఈరకంగా వుత్తర ప్రత్యుత్తరాలఖర్చుతో సొంతంగా కొనుక్కుంటే ఒక బహుమతి వచ్చి వుండేది.

చాలా దారుణం యిది ! అన్యాయం యిది !

10-12-85 నాలాంటి అభిమానులు
'తెలుగువాడి'కి దూరమైపోతారు.-
చంటిబాబు

*　　　　*

చంటిబాబుగారూ !

ఆదరాబాద్ వస్తే మా ఆఫీస్‌కోసారి రండి ! నూతన సంవత్సరం శుభాకాంక్షలతో.

2-1-86　　　　అకౌంటెంట్
తె.వా. ఆ.బా.

*

తేదీ 5-1-86
వూరు ఆదరాబాద్.
స్థలం తెలుగువాడి కార్యాలయం

*　　　　*


"నమస్కారం సార్ !"


"......!"

"నమస్కారం ! నన్ను మీరు యిదే మొదటిసారి కదూ సార్ చూడటం ! మీరు నాకు తెలుసుకదా సార్ !"

"ఎలా తెలుసు ? మీరు...."

"చంటిబాబును సార్ ! గోంగూర పాడు సార్ ! 9-4-85 వారపత్రికలో



-అదేసార్ మన 'తెలుగువాడు' లో సార్...

"రైట్ రైట్... లేఖకి బహుమతి అనీ... పంపించమనీ.... !"

"అవున్సార్! అది అందుకుందామనే వచ్చాన్సార్! రాత్రంతా రైల్లో నిలబడి వచ్చాన్సార్! మరీ దగ్గరైపోయింది కదాసార్! రిజర్వేషన్ దొరకదుసార్!"

"గోంగూరపాడు రైల్వే స్టేషన్ వుందాండీ!"

"బ్రిటిష్ వాళ్ళటైంలో వుండేదట సార్!"

"అలాగా! ఎడిటర్‌గారిని కలిశారా?"

"ఇంకా లేదుసార్!"

"వారు సెలవులో వున్నట్టున్నారు!"

"బహుమతి రికమెండ్ చేశారాసర్!"

"ఉత్తరానికి బహుమతి వస్తే చాల సంతోషపడ్డారు. అవునా?"


అవునుసార్! "తెలుగువాడు" నా రక్తంలో రక్తం సార్!

"థాంక్స్! మీరుకూడా 'తెలుగువాడి'కి అంతేకదా!"

"అంతే సార్!"

"వుత్తరం రాసి మీరు సంతోష పెట్టారు. బహుమతి ప్రకటించి తెలుగువాడు మిమ్మల్ని సంతోషపెట్టాడు!"

"అంతేనాసార్! బహుమతి అంటూ ఏమీ వుండదా?"



"తన సంతోషమె తనకు బలము. తెలుగువాడికి సూక్తి! ఆచరణా!"

"......!"

"సెలవు!"

* *

13-1-86 సంక్రాంతి సంచిక పరమద్భుతంగా వుంది. 'తెలుగువాడు' పత్రిక తెలుగునేలకే శోభాయమానం! కథలన్నీ రసగుళికలు! సీరియల్స్ దేనికదే సాటి! ముఖ్యంగా "నిజాయితీ! నీ ఖరీదుయిదా!" సీరియల్‌లో హీరోయిన్ చచ్చిపోతుందేమోనని భయంగా వుంది. అమెను చంపవద్దని రచయితగారికి మనవి.

ముఖచిత్రాలు అందంగా ప్రచురించడంలో మన తెలుగువాడేసాటి! చిన్న మనవి. ఈ లేఖను బహుమతి పొందిన లేఖగా మాత్రం ప్రచురించకండేం!

5-4-86

-చంటిబాబు (?)

* * *

అయ్యా! సంపాదక మహాశయా!

27-1-86 సంచికలో 13-1-86 సంచిక గురించి నా వుత్తరానికి బహుమతి ప్రకటించారు. దానిక్రింద 'చంటిబాబుగారు తమ పూర్తి చిరునామా పంపింతే బహుమతి పంపగలం!' అని కూడా రాశారు.

వద్దు.

బహుమతీవద్దు! మీరు పంపనూవద్దు!

అందుకే ఫ్రం అడ్రస్ మీకివ్వడం లేదు.

—చంటిబాబు...